E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 11-03-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:68|| పేజీలు–6
www.ekaburu.com

## 2028 వరకు జల్‌జీవన్ మిషన్



కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు

ఈ-కబురు, న్యూఢిల్లీ: జల్ జీవన్ మిషన్(జేజేఎం)ను డిసెంబర్ 2028 వరకు పొడిగించడం సహా కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

....(మిగతా2లో)




### నేడు కొత్త గవర్నర్ బాధ్యతలు

ఈ-కబురు,హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం ఉదయం 11.30 గంటలకు లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు.




### కవిత దీక్ష భగ్నం.. హైదరాబాద్ తరలింపు

ఈ-కబురు,హైదరాబాద్/ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని వెలుగుమట్లలో భూదాన్ బాధితులకు మద్దతుగా అంబేద్కర్ భవన్ వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన దీక్షను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున భగ్నం

# దాడులు ఉధృతం



- అమెరికాపై ఒత్తిడి పెంచడానికి ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణుల వర్షం
- జెరూసలేం, టెల్ అవీవ్‌లో పేలుళ్ల మోత
- బహ్రెయిన్ రాజధాని మనామాపై దాడిలో ఒకరి మృతి.. 8 మందికి గాయాలు
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడిలో ఐదుగురు హెజ్‌బోల్లా మిలిటెంట్లు హతం
- హోర్ముజ్‌లో చమురు రవాణా నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన నౌకలు
- ఇరాన్ నాయకత్వం నానాటికీ బలహీనపడుతోందన్న నెతన్యాహు
- ఉత్తుత్తి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న ఇరాన్

దుబాయ్: పశ్చిమాసియా యుద్ధం కొత్త మలుపు తిరుగుతోంది. అమెరికాపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ అరబ్ దేశాలపై దాడులు ఉధృతం చేస్తోంది. యుద్ధం మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. బహ్రెయిన్ రాజధాని మనామాపై ఇరాన్ విరుచుకుపడింది. ఓ భవనంపై జరిగిన క్షిపణి దాడిలో ఒక మహిళ(29) మరణించగా, 8 మంది గాయపడ్డారు. ఇరాన్ ప్రయోగించిన రెండు డ్రోన్లను ధ్వంసం చేశామని సౌదీ అరేబియా ప్రకటించింది. ఆరు డ్రోన్లు నేలకూల్చినట్లు కువైట్ నేషనల్ గార్డు దళం వెల్లడించింది. యూఏఈలో పారిశ్రామిక నగరమైన రువాస్‌పై ఇరాన్ డ్రోన్లు ప్రయోగించింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మరోవైపు బాంబులు, సైరన్ల మోతతో ఇజ్రాయెల్ దద్దరిల్లింది. జెరూసలేం, టెల్ అవీవ్‌లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ ప్రయోగించిన కొన్ని క్షిపణులను ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ మధ్యలోనే అడ్డుకుంది. మరికొన్ని క్షిపణులు లక్ష్యాలను తాకినట్లు తెలుస్తోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై వైమానిక దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. టెహ్రాన్‌లో పెద్ద ఎత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. తమవైపు దూసుకొచ్చిన ఇరాన్ మిస్సైళ్లను తుత్తునియలు చేశామని ఖతార్ రక్షణ శాఖ తెలియజేసింది.

**హోర్ముజ్‌పై ఇరాన్ గురి**

ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలపై కేవలం మిస్సైళ్లు, డ్రోన్ల దాడులతో సరిపెట్టకుండా హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇక్కడ చమురు రవాణా నౌకలను అడ్డుకుంటోంది. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలకు రెక్కలొస్తున్నాయి. ధరలు పెరిగేకొద్దీ అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి పెరగడం తథ్యమని, ఫలితంగా ఆ రెండు దేశాలు యుద్ధాన్ని ఆపాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని ఇరాన్ అంచనా వేస్తోంది. ముడి చమురు బ్యారెల్ ధర 90 డాలర్లు దాటేసింది. ఫిబ్రవరి 28 నాటి ధరతో పోలిస్తే ఇది 24 శాతం అధికం. హోర్ముజ్‌లో చమురు రవాణా నౌకలపై ఇప్పటిదాకా జరిగిన దాడుల్లో ఏడుగురు నావికులు మరణించారు. మంగళవారం పర్షియన్ గల్ఫ్‌లో యూఏఈ తీరంలో చమురు రవాణా నౌకపై దాడి జరిగినట్లు సమాచారం.

....(మిగతా2 లో)

# హోటల్.. హడల్!

- ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో.. గృహావసరాలకు, అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- దీంతో వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేసిన గ్యాస్ ఏజెన్సీలు
- రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లోని హోటళ్లపై ఎఫెక్ట్!
- చిన్న, మధ్యతరగతి రెస్టారెంట్లు, మెస్‌లు, టిఫిన్ సెంటర్లపైనా ప్రభావం పడే అవకాశం
- ఇప్పటికే ముంబై, బెంగళూరులో 20 శాతం వరకు మూతపడ్డ హోటళ్లు!
- గృహావసరాలపై ఆందోళన వద్దు.. సిలిండర్ల నిల్వలు పుష్కలంగా ఉన్నాయంటున్న అధికారులు




ఈకబురు,హైదరాబాద్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం హోటల్ రంగాన్ని తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తోంది. గల్ఫ్ దేశాల నుంచి పెట్రో ఉత్పత్తుల దిగుమతికి ఆటంకాలు ఎదురవుతుండటంతో దేశంలో వాణిజ్యావసరాలకు ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. గృహావసరాలకు, అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. మరోవైపు ఈ నెల 7వ తేదీ నుంచి గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచింది. కేంద్రం ఆంక్షల నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీలు కమర్షియల్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశాయి. దీంతో ఇప్పటికే ముంబై, బెంగళూరులో 20 శాతం హోటళ్లు మూతపడినట్లు తెలుస్తోంది. చిన్న, మధ్య తరగతి హోటళ్లు, మెస్‌లు, హాస్టళ్లపై సైతం దీని ప్రభావం పడుతోంది. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లోనూ సమస్య తలెత్తుతున్నట్టు సమాచారం.

**వీరికి హోటళ్లే ఆధారం**

తెలంగాణలో 1.49 కోట్ల గృహ వినియోగదారులు ఉండగా, నెలకు కోటికి పైగా సిలిండర్లు వినియోగమవుతున్నాయి. అలాగే 5 లక్షల వాణిజ్య కనెక్షన్లు ఉండగా, వినియోగం దానికి రెట్టింపు స్థాయిలో ఉంటుంది. కాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 25 వేలకు పైగా మీడియం స్థాయి హోటళ్లు, రెస్టారెంట్లు ఉండగా, చిన్న హోటళ్లు భారీ ఎత్తున ఉన్నాయి. మెస్‌లు, చిన్న చిన్న రోడ్డుపక్క హోటళ్లు లెక్కలేనన్ని ఉన్నాయి. ఇక స్టార్ హోటళ్లు, క్లబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లు కూడా హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. చిన్న చిన్న హోటళ్లు రోజుకు ఒక సిలిండర్, పెద్దవి 3-5 వినియోగిస్తాయి. వినియోగదారులను బట్టి రెస్టారెంట్లు, బార్లలో కూడా రోజుకు ఐదుకు తక్కువ కాకుండా సిలిండర్ల వినియోగం ఉంటుంది.

....(మిగతా2లో)

## ఆరు గ్యారంటీల
# చట్టబద్ధతకు ప్రైవేట్ బిల్లు : కేటీఆర్

- శాసనసభలో ప్రవేశపెట్టే ఈ బిల్లుకు అధికార పార్టీ మద్దతివ్వాలి: కేటీఆర్
- ప్రభుత్వ పదవీకాలం సగం పూర్తయినా హామీల అమలు జరగట్లేదు
- అసెంబ్లీ కమిటీలు లేకుండానే బలవంతపు సమావేశాలు
- ప్రభుత్వం చేస్తున్న అంకెల గారడీని బయట పెడతాం
- ముగిసిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఓరియెంటేషన్ ప్రోగ్రామ్



ఈకబురు,హైదరాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు మొదటి కేబినెట్ సమావేశంలోనే చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావొస్తున్నా అమలు చేయడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టేందుకు సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ప్రవేశపెట్టే ప్రైవేట్ మెంబరు బిల్లుకు అధికార పార్టీ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర శివారులోని గోల్కొండ రిసార్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న మూడో వార్షిక బడ్జెట్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వ పదవీకాలం సగం పూర్తయినా హామీల అమలు జరగడం లేదు.

....(మిగతా2లో)



## ప్రధాని మోదీతో దత్తాత్రేయ భేటీ

ఢిల్లీ: హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం పార్లమెంటు భవనంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు.

....(మిగతా2లో)

## మూడేళ్లలో పంచాయతీలకు
# శాశ్వత భవనాలు

- ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- పీఆర్ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి సూచన



ఈకబురు,హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో శాశ్వత భవ నాల్లేని గ్రామపంచాయతీల భవనాలు నిర్మించే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. స్థలాలు అందుబాటులో ఉన్న చోట తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, అవసరమైన పౌష్టికాహారంతో పాటు బోధనా పద్ధతులతో తర్ఫీదు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో రోడ్లపై కొందరు చంటి బిడ్డలతో యాచక వృత్తి కొనసాగిస్తున్నారని, వారందరినీ శిశు విహార్‌లో చేర్చుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారకుండా చూడాలన్నారు. శిశు విహార్లలో ఆధునిక వంట గదిని నిర్మించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో 2026-27 బడ్జెట్ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రీ-బడ్జెట్ సమావేశం నిర్వహించారు.

....(మిగతా2లో)

# పుతిన్‌కు ట్రంప్ ఫోన్

- పశ్చిమాసియా సంక్షోభంపై అభిప్రాయాలు పంచుకున్న ఇరువురు నేతలు



మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి రష్యా అధినేత పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వారిద్దరి మధ్య దాదాపు గంటపాటు సంభాషణ సాగింది. ఇరాన్–అమెరికా, ఉక్రెయిన్–రష్యా సంఘర్షణలపై ఇరువురు నేతలు చర్చించినట్లు రష్యా విదేశాంగ విధాన ప్రతినిధి యూరీ ఉషకోవ్ వెల్లడించారు.

....(మిగతా2లో)

## 11 నుంచి ఏప్రిల్ 1 వరకు పలు రైళ్ల రద్దు



ఈకబురు, కాచిగూడ (హైదరాబాద్): రైళ్ల నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 11వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కాచిగూడ–కర్నూల్ సిటీ (17435), 12 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కర్నూల్ సిటీ – కాచిగూడ (17436) రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) సంతోష్ కుమార్ వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

....(3లో)



# వంటగ్యాసే ఫస్టు!

- ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ ఉత్పత్తికి తొలి ప్రాధాన్యం
- వాటికే మొదట సహజ వాయువు సరఫరా
- ఎరువుల తయారీకి ఆరు నెలల సగటులో 70 శాతం సరఫరా
- పారిశ్రామిక వినియోగదారులకు 80%
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

....(మిగతా2లో)

ఈకబురు, న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురు, సహజ వాయువు దిగుమతుల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయి. దేశంలో వంట గ్యాస్ సరఫరా తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గృహ వినియోగానికి ప్రస్తుతం ఇబ్బందులు లేకపోయినా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరా తగినంత లేకపోవడంతో ప్రధాన నగరాల్లో హోటళ్లు మూతపడుతున్నాయి. రవాణా రంగానికి అవసరమైన గ్యాస్ సరఫరా నిలిచిపోతోంది.

## 13న రైతుల ఖాతాల్లోకి..
# పీఎం కిసాన్ నిధులు



....(మిగతా3లో)

## ఆ ధైర్యం చేయకండి
## .. పిటిషనర్లపై సుప్రీం ఫైర్



....(3లో)

ఈ-కబురు
11- 03 -2026
బుధవారం
E-kaburu.com

# దాడులు ఉధృతం



హెజ్‌బోల్లాపై ఇజ్రాయెల్ దాడులు

ఇరాన్ అండదండలతో దాడులకు తెగబడుతున్న హెజ్‌బోల్లా మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం గురిపెట్టింది. లెబనాన్‌లోని హెజ్‌బోల్లా స్థావరాలపై క్షిపణులు వర్షం కురిపించింది. ఈ ఘటనలో కనీసం ఐదుగురు మిలిటెంట్లు హతం కాగా, నలుగురు గాయపడినట్లు తెలిసింది. ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని దక్షిణ లెబనాన్ ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం సూచించింది. హెచ్‌బొల్లాపై భీకర దాడులు చేయడానికి ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్‌లో ఇప్పటివరకు 1,230 మంది మరణించారు. లెబనాన్‌లో 397 మంది, ఇజ్రాయెల్‌లో 11 మంది మృతిచెందారు. అలాగే ఏడుగురు అమెరికా జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

మధ్యవర్తిత్వానికి సిద్ధం: రష్యా

యుద్ధాన్ని ముగించడానికి తమ వంతు సహకారం అందిస్తామని, మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నామని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలని ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికాలకు సూచించారు.

ఇరాన్‌పై అత్యంత భీకర దాడులు: హెగ్సెత్

ఇరాన్‌పై అత్యంత భీకర దాడులు చేయబోతున్నామని అమెరికా [illegible]ఖ మంత్రి పీట్ హెగ్సెత్ తేల్చి చెప్పారు. ఈరోజే ఈ దాడులు [illegible]బోతున్నాయని మంగళవారం ప్రకటించారు. ఇరాన్‌పై గరిష్ఠ సంఖ్యలో ఆయుధాలు ప్రయోగిస్తామన్నారు. ఇరాన్ సైన్యం గత 24 గంటల్లో స్వల్పంగానే క్షిపణులు ప్రయోగించిందని తెలిపారు. ఇరాన్ ఆయుధ బలం క్షీణిస్తోందని తెలిపారు.

బెదిరింపులకు భయపడం: ఇరాన్

యుద్ధంలో తగ్గేదేలే అంటూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ ఎక్స్'లో పోస్టుచేశారు. కాల్పుల విరమణ కోసం ఎదురు చూడడం లేదని, శత్రువులకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఇరాన్ సైనికాధికారి అలీ లరిజానీ ఉద్ఘాటించారు. హార్మూజ్‌లో చమురు రవాణాను అడ్డుకుంటే 20 రెట్లు బలంగా దెబ్బకొడతామన్న ట్రంప్ హెచ్చరికలను కొట్టిపారేశారు. అమెరికా కంటే బలమైన దేశం కూడా ఇరాన్‌ను ఏమీ చేయ లేన్నారు. 'మిమ్మల్ని మీరు నాశనం చేసుకో కుండా జాగ్రత్తగా ఉండండి' అంటూ అమెరికాకు సూచించారు.

ఇరాన్ ప్రజలకు సహకరిస్తాం

నియంతృత్వం, రాక్షస పాలన నుంచి బయటపడడానికి ఇరాన్ ప్రజలకు సహకరిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారు. అంతిమంగా రాజకీయ, పాలనాపరమైన మార్పును సాధించుకోవడం వారి చేతుల్లోనే ఉందని చెప్పారు. ఇజ్రాయెల్ ప్రయత్నాలతో ఇరాన్ నాయకత్వం బలహీనపడుతోందని పేర్కొన్నారు. ఇరాన్ సైన్యం వెన్నుముక విరిచేశామని, ఇప్పటికీ తాము క్రియాశీలకంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. ఇరాన్‌లో శాశ్వతమైన మార్పు రావాలన్నదే తమ ఉద్దేశమన్నారు.

## నేడు కొత్త గవర్నర్ బాధ్యతలు



ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులు, అధికార, విపక్ష పార్టీల నేతలు, అధికారులు పాల్గొంటారు. గవర్నర్‌గా నియమితులైన శివప్రతాప్ శుక్లా మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

## ఆరు గ్యారంటీల చట్టబద్ధతకు ప్రైవేట్ బిల్లు : కేటీఆర్

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ హామీల వైఫల్యం, మోసాన్ని ఎండగట్టేందుకు అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించాం. రెండేళ్లుగా అసెంబ్లీ కమిటీలు లేకుండానే ప్రభుత్వం సమావేశాలను బలవంతంగా నడిపిస్తోంది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవిని మా పార్టీకి ద్రోహం చేసి వెళ్లిన వ్యక్తికి ఇచ్చారు. సెలెక్ట్, స్టాండింగ్, పిటిషన్స్ తదితర 14 అసెంబ్లీ కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లాంటి పదవులు భర్తీ చేయకుండా మందబలంలో బుల్డోజర్ టాక్టిక్స్‌ను ప్రభుత్వం ప్రయోగిస్తోంది. అసెంబ్లీ ఉభయ సభల్లో అబద్ధాలు, అసత్యాలతో అంకెలను తారుమారు చేస్తూ తూతూమంత్రంగా సమావే శాలు నిర్వహిస్తోంది'అని కేటీఆర్ మండిపడ్డారు.

అసెంబ్లీలో కాంగ్రెస్‌ను నిలదీసేందుకే..

'ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అసెంబ్లీలో నాటకాలు ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలంగా నిలదీయడానికే అవగాహన సమావేశాలు బీఆర్ఎస్ ఏర్పాటు చేసింది. రైతుబంధు, ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేత, మూసీ బాధితులు తదితర అంశాలతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అసెంబ్లీలో ప్రభుత్వం చేస్తున్న అంకెల గారడీని, లేని అప్పులను ఉన్నవిగా చూపిస్తున్న కాంగ్రెస్ అబద్ధాలను అంకెలతో సహా ఎండగడతాం. భవిష్యత్‌లోనూ బీఆర్ఎస్ శాసన మండలి, శాసనసభ సభ్యుల నడుమ మా పార్టీ సమన్వయం కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఆరు గ్యారంటీలు, హామీల అమలుకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరిట భారీ అవినీతికి తెరలేపింది.

మేము సుందరీకరణకు కాకుండా దాని పేరిట జరుగుతున్న అవినీతిని వ్యతిరేకిస్తున్నాం. ఢిల్లీకి నిధులు పంపేందుకే రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును చేపడుతున్నాడు. రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు ఎంత మాత్రం విలువ లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పట్టపగలు నాశనం చేసిన సీఎం 'నైట్ ఎకానమీ'గురించి మాట్లాడుతున్నాడు. రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ఒక్క ఇల్లు కట్టినా నేను రాజీనామా చేస్తాను అని చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నా. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఇళ్లు, ఫ్లైఓవర్లు, ప్రాజెక్టులకు రంగులు పూసి రేవంత్ తమ ఘనతగా చెప్పుకుంటున్నాడు'అని కేటీఆర్ విమర్శించారు.

ముగిసిన అవగాహన కార్యక్రమం

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి తదితరులు ప్రసంగించారు. పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి వివిధ అంశాలపై ప్రసంగించారు.

## హోటల్.. హడల్!

అదే స్టార్ హోటళ్లు రోజుకు 25 సిలిండర్లకు పైగా వినియోగిస్తాయి. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మంచిర్యాల, రామగుండం, కొత్తగూడెం వంటి నగరపాలక సంస్థలతో పాటు జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీలు, మండల కేంద్రాలలోని హోటళ్లలో కూడా గ్యాస్ సిలిండర్ల వినియోగం పెద్ద ఎత్తున ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులకు హోటల్ ఆహారమే ఆధారం. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపివేస్తే హోటళ్లు మూత పడడమే కాకుండా లక్షలాది మంది ఉపాధికి గండి పడుతుంది.

**60–65 శాతం ఎల్‌పీజీ దిగుమతి**

భారత్ 60-65 శాతం ఎల్‌పీజీ కోసం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి సరఫరా ఆగిపోవడంతో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడింది. 2025లో ఎల్‌పీజీ వినియోగం 31 మిలియన్ టన్నులకు చేరగా, దేశీయంగా గ్యాస్ ఉత్పత్తి కేవలం 12-13 మిలియన్ టన్నులకే పరిమితమవడంతో సమస్య మరింత ఉధృతమైంది.

**ప్రత్యామ్నాయాల అన్వేషణలో హోటల్ రంగం**

తాజా పరిస్థితులతో ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు హోటల్ రంగం మొగ్గు చూపుతోంది. ఎలక్ట్రిక్ స్టవ్‌లు, బయోగ్యాస్ వంటి ఆప్షన్లు పరిశీలిస్తున్నప్పటికీ, అవి ఖర్చుతో కూడుకున్నవే గాక తక్షణ పరిష్కారానికి వీలుకానివనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వంటగదుల్లో విద్యుత్ వినియోగం పెంచే ఆలోచనలో హోటళ్ల యజమానులు ఉన్నారు.

**హైదరాబాద్‌లో పుష్కలంగా నిల్వలు**

యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడుతుందనే ప్రచారంతో సాధారణ రోజుల కంటే ఇప్పుడు గృహ వినియోగం బుకింగ్‌ల సంఖ్య 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో సిలిండర్ల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వినియోగదారులు అనవసరంగా భయాందోళన చెందవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి: భారత్ గ్యాస్**

వంట గ్యాస్ కొరతపై జరుగుతున్న ప్రచారంతో ప్రజలు ఆందోళన చెందుతుండడంతో గ్యాస్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. భారత్ పెట్రోలియం కంపెనీ లిమిటెడ్..ఎల్‌పీజీ వినియోగదారులు ఆందోళన చెందవద్దంటూ సంక్షిప్త సందేశాలు పంపుతోంది. 'ఇంధన సరఫరాలో కొరత ఉందని సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే, ఆధార రహితమైన వార్తలు ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉంది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నాం. ఇంధనాన్ని సమర్థవంతంగా, అవసరానికి అనుగుణంగా వినియోగించడం మంచిది' అని బీపీసీఎల్ ఆంగ్లంలో ఎస్ఎంఎస్‌లు పంపించింది. అయితే గృహ వినియోగదారులు ఒకసారి గ్యాస్ బుక్ చేసిన తర్వాత మరోసారి బుక్ చేయాలంటే ఇప్పటివరకు ఉన్న 21 రోజుల గడువును 25 రోజులకు పెంచుతూ ఆయిల్ కంపెనీల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఏజెన్సీలు చెబుతున్నాయి.

**హోటళ్లు మూతపడే ప్రమాదం: హోటల్స్ అసోసియేషన్**

వాణిజ్య ఎల్‌పీజీ సరఫరా నిలిచిపోతే హోటల్ రంగం మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర హోటళ్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్ తదితరులు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి సమస్యను వివరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మంత్రి ఢిల్లీకి వెళ్లిన కారణంగా వచ్చిన తర్వాత ఆయన్ను కలుస్తామని వెంకటరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటివరకు హైదరాబాద్ నగరంలో హోటళ్లు మూతపడిన దాఖలాలు లేవని, కానీ సోమవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారని ఆయన వివరించారు.

## కవిత దీక్ష భగ్నం.. హైదరాబాద్ తరలింపు



చేశారు. డీఎస్పీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌తో కలిసి సోమవారం రాత్రి ఆమె దీక్ష ప్రారంభించిన విషయం విదితమే.

ఈ మేరకు తెల్లవారుజామునే పెద్దసంఖ్యలో చేరుకున్న పోలీసులు కవిత తదితరులను వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయానికి తరలించారు. అయితే వెలుగుమట్ల బాధితులకు ప్రభుత్వం కూల్చివేసిన చోటే కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే డిమాండ్‌తో కవిత తన దీక్షను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 'వెలుగుమట్లలో బాధితులకు ఇళ్లు నిర్మించి ఇచ్చేంత వరకు నిరాహార దీక్ష కొనసాగుతుంది'అని చెప్పారు.

రాహుల్‌గాంధీకి కవిత లేఖ :

వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేత ఘటనపై కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం జోక్యం చేసుకోవాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి ఆమె మంగళవారం లేఖ రాశారు. ప్రభుత్వ చర్యల వల్ల సుమారు 600 ఇళ్లు బుల్డోజర్లతో కూల్చివేయబడగా దాదాపు 2 వేల మంది ఒక్కరాత్రిలోనే నిరాశ్రయులయ్యారని ఆమె తెలిపారు. బాధితుల్లో అధికంగా సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలే ఉన్నాయని పేర్కొన్నారు.

## 2028 వరకు జల్‌జీవన్ మిషన్

జేజేఎం 2.0 కింద రూ.8.7 లక్షల కోట్లను వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లోని 3.23 కోట్ల గృహాలకు పైపులైన్ల ద్వారా తాగునీటిని అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. దేశంతో భూ సరిహద్దులు కలిగిన చైనా, ఇతర దేశాలకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఉన్న నిబంధనలను సడలించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి చెప్పారు. ఎలాంటి అనుమతుల అవసరం లేకుండానే ఆయా దేశాల వాటాదారులు, 10 శాతం వరకు దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఏర్పడనుందన్నారు. ఈ మేరకు 2020లో జారీ చేసిన నోటీసును సవరించనుందని చెప్పార. మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించాలన్న ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపైగల మధ్యప్రదేశ్‌లోని 80 కిలోమీటర్ల బద్నావర్-తిమర్వానీ సెక్షన్‌ను రూ.3,839 కోట్లతో నాలుగు లేన్లుగా 24 నెలల కాలంలో విస్తరించాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. దీంతోపాటు, బెంగాల్-జార్ఖండ్‌లను కలిపే రూ.4,474 కోట్ల విలువైన రెండు రైల్వే ప్రాజెక్టులను కేబినెట్ ఆమోదించింది. ఇన్‌సాల్వెన్సీ లా, కంపెనీ చట్టానికి సవరణలు చేపట్టాలని కూడా కేబినెట్ తీర్మానించిందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

## వంటగ్యాసే ఫస్టు!

సమస్య పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజ వాయువును ప్రాధాన్యతా క్రమంలో సరఫరా చేయాలని ఆదేశించింది. మొదట ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ తయారీకి, తర్వాత ఎరువుల ఉత్పత్తికి, అనంతరం తేయాకు పరిశ్రమ, పారిశ్రామిక వినియోగదారులకు, ఆ తర్వాత సిటీ గ్యాస్ సరఫరాదారులకు సహజ వాయువును సరఫరా చేయాలని పేర్కొంది. ఈ మేరకు సోమవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ గ్యాస్‌ను మొదట ద్రవీకృత పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) తయారీకి అందజేయాలని తేల్చిచెప్పింది.

పారిశ్రామిక వినియోగదారులకు 80%

ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ ఉత్పత్తిలో సహజ వాయువును ముడి సరుకుగా ఉపయోగిస్తారు. ముడి చమురు శుద్ధి ప్రక్రియలో ఒక ఉపఉత్పత్తి ఎల్పీజీ. అలాగే సహజ వాయువును ప్రాసెస్ చేయడం ద్వారా ఎల్పీజీని తయారు చేస్తారు. కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం.. మొదట ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ తయారీకి ప్రాధాన్యం ఇస్తూ సహజ వాయువును సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆయా రంగాల్లో గత ఆరునెలల సగటు వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని అందులో 100 శాతం సరఫరా చేయాలి. ఈ మూడు రంగాల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూనే ఎరువుల తయారీ, తేయాకు పరిశ్రమతోపాటు ఇతర పారిశ్రామిక వినియోగానికి గ్యాస్ అందజేయాలి. ఎరువుల తయారీ రంగానికి గత ఆరు నెలల సగటు డిమాండ్‌లో కనీసం 70 శాతం సరఫరా చేయాలి. ఇక తేయాకు పరిశ్రమ, ఉత్పత్తి, పారిశ్రామిక వినియోగదారులకు గత ఆరు నెలల సగటు డిమాండ్‌లో 80 శాతం సహజ వాయువు అందజేయాలి. పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ సరఫరా చేసే సిటీ గ్యాస్ సరఫరాదారులకు(సీజీడీ) ఆరు నెలల సగటు డిమాండ్‌లో 80 శాతం ఇవ్వొచ్చు. దేశీయంగా నిత్యం 191 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువు అవసరం. దేశంలో రోజువారీ మొత్తం అవసరాల్లో సగం దేశీయ సహజ వాయువే తీరుస్తోంది. పెట్రోకెమికల్ ప్లాంట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ఈ గ్యాస్‌ను సరఫరా చేయకుండా నియంత్రణ విధించారు.

మూసివేత దిశగా హోటళ్లు

వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల కొరత హోటళ్లు, రెస్టారెంట్లపై పెను ప్రభావం చూపుతోంది. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఆహారశాలలు మూతపడుతున్నాయి. ముంబై, బెంగళూరు, పుణే, అహ్మదాబాద్, ఔరంగాబాద్, నాగపూర్, ఢిల్లీ వంటి నగరాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే వందలాది హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. రానున్న రెండు రోజుల్లో పరిస్థితి ఇంకా తీవ్రమయ్యే అవకాశాలున్నాయని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ) అధ్యక్షుడు సాగర్ దర్యానీ మంగళవారం చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి వాణిజ్య సిలిండర్ల సరఫరా తగ్గిపోయినట్లు తెలియజేశారు.

ఎల్పీజీ ఉత్పత్తి 10% పెంపు

దేశంలో ఎల్పీజీ సంక్షోభం లేదని, ఎవరూ ఆందోళన చెందొద్దని కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టం చేసింది. తమ ఆదేశాల మేరకు చమురు శుద్ధి కంపెనీలు ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం పెంచాయని వెల్లడించింది. రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పని చేస్తున్నాయని తెలిపింది. వంట గ్యాస్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, ప్రజలెవరూ నమ్మొద్దని కోరింది. ఎల్పీజీ సరఫరా స్థిరంగా కొనసాగుతున్నట్లు వెల్లడించింది. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా, అవకతవకలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో అత్యవసర సేవల నిర్వహణ చట్టాన్ని(ఎస్మా) అమలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి.

మన ప్రజలు ఇబ్బంది పడొద్దు

చమురు, గ్యాస్ సరఫరా, ధరల విషయంలో సమన్వయంతో పనిచేయండి

కేంద్ర మంత్రులకు ప్రధాని మోదీ ఆదేశం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం, తద్వారా దేశంలో చమురు, వంట గ్యాస్ సరఫరాలో ఆటంకాలు ఎదురవుతుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా, ధరల విషయంలో మన దేశ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా దాడులు, ఇరాన్ ప్రతిదాడులు, హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం మన వినియోగదారులపై పడకుండా చూడాలని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. అంతేకాకుండా చమురు, వంట గ్యాస్ కొరత లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధరలు పెరుగుతున్న తీరుపైనా ప్రధానమంత్రి సమీక్షించారు. పశ్చిమాసియా నుంచి చమురు సరఫరా తగ్గడంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రష్యా, అమెరికా, వెనెజువెలా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపాయి.

## మూడేళ్లలో పంచాయతీలకు శాశ్వత భవనాలు




గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ఈ శాఖలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం కోతలు విధిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేసే దిశగా చర్య లు తీసుకుంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉండేలా రాష్ట్రం నుంచి అవసరమైన నిధు లు కేటాయించి పథకం అమలు కొన సాగించేందుకు చర్యలు తీసుకుంటామని భట్టి విక్ర మార్క, సీతక్క వెల్లడించారు. ఏజెన్సీలో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని భట్టి స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్‌శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేశ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, పీఆర్ కమిషనర్ దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## పుతిన్‌కు ట్రంప్ ఫోన్



ప్రధానంగా పశ్చిమాసియా సంక్షోభంతోపాటు ఉక్రెయిన్‌లో శాంతి సాధన కోసం కొనసాగుతున్న మాస్కో-వాషింగ్టన్-కీవ్ చర్చలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిపారు. ట్రంప్, పుతిన్ మధ్య సంభాషణ స్వేచ్ఛాయుతంగా, నిర్మాణాత్మకంగా జరిగిందని పేర్కొన్నారు.

ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధం పట్ల పుతిన్ తన అభిప్రాయాలు వ్యక్తంచేశారని, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోపాటు గల్ఫ్ దేశాల నాయకులతో గతవారం జరిగిన చర్చల సారాంశాన్ని ట్రంప్‌కు పుతిన్ తెలియజేశారని చెప్పారు. ట్రంప్ సైతం తాజా పరిణామాలపై తన మనసులో మాటను పుతిన్‌తో పంచుకున్నారని స్పష్టంచేశారు. ఈ ఏడాది ట్రంప్, పుతిన్ ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది 11వ సారి కావడం విశేషం. భారత్, చైనాలతోపాటు యూరప్‌లోని మిత్రదేశాలకు చమురు సరఫరాను పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నామని పుతిన్ తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆయనతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడడం ప్రాధాన్యత సంతరించుకుంది.

యుద్ధానికి త్వరలోనే ముగింపు

ఇరాన్‌పై యుద్ధం అతి త్వరలో ముగిసిపోతుందని తాను అంచనా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఇరాన్‌పై గత పది రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని 'స్వల్పకాలిక విహార యాత్ర'గా అభివర్ణించారు. ఆయన తాజాగా ఫ్లోరిడాలో మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌లో ఇప్పటిదాకా 5,000 లక్ష్యాలపై అమెరికా-ఇజ్రాయెల్ సైన్యం దాడి చేసిందని వెల్లడించారు. త్వరలోనే యుద్ధం ముగిసి, సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న నమ్మకం ఉందన్నారు.

## ప్రధాని మోదీతో దత్తాత్రేయ భేటీ



గవర్నర్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన తొలిసారి ప్రధానితో భేటీ అయ్యారు. 2014లో ఏర్పడిన మోదీ తొలి ప్రభుత్వంలో కార్మికశాఖ మంత్రిగా, అనంతరం హిమాచల్‌ప్రదేశ్, హరియాణాలకు గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ తన ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ప్రధానికి అందజేశారు. అనంతరం దత్తాత్రేయ ఆరోగ్యం గురించి మోదీ వాకబు చేశారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు



*2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు
* 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు
* 'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు
* సమన్వయలోపం తలెత్తకుండా స్పెషల్ ఆఫీసర్, శాఖలవారీగా నోడల్ అధికారులు
* ఈ నెలఖారుకు డీపీఆర్ పూర్తి... తొలి దశలో 'టైర్ – 1' ప్రాంతాల్లో పనులు
* కేబినేట్ సబ్ కమిటీ తొలి సమావేశంలో మంత్రులు

ఈకబురు,, హైదరాబాద్ :
కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' క్యాబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. 'తెలంగాణ బ్రాండ్' మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశంలో... సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి... అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో... మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వేగంగా పనుల్ని ప్రారంభించేలా ముమ్మర కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల చివరి నాటికి డీపీఆర్ లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ - 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. పుష్కర ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తే లేదని, పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

## 11 నుంచి ఏప్రిల్ 1 వరకు పలు రైళ్ల రద్దు



11 నుంచి 31 వరకు కాచిగూడ - రాయచూర్ -కాచిగూడ వయా దేవరకద్ర, కృష్ణా (67787, 67788), కాచిగూడ- రాయచూర్-కాచిగూడ వయా గద్వాల్ (17693, 17694) రైళ్లను రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. గద్వాల్ - రాయచూర్-గద్వాల్ (67784, 67783)ను రద్దు చేస్తున్నామని వివరించారు.

## తెలుగు వైభవాన్ని చాటేలా
# అమరావతి అభివృద్ధి



–సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించండి
–క్రీడలు, పర్యాటకానికి పెద్ద పీట వేసేలా ప్రణాళికలు
–పెట్టుబడులు పెట్టడానికి వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు
–59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
–భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్డీఏ అథార్టీ ఆమోదం

ఈకబురు,అమరావతి, మార్చి 10:
తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా... భావి తరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్డీఏ నుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథార్టీ సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు తెలుగు వైభవాన్ని చాటేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు వస్తాయి. పర్యాటకంతో పాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చూడాలి. హోటళ్లను ఏర్పాటు చేయాలి... అమ్యూజ్మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలి. అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా ఆ ప్రాంతాన్ని డిజైన్ చేయాలి. నీరుకొండలో చేపట్టే బోయే ప్రాజెక్టును అత్యంత సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలి. భవిష్యత్తులో క్రీడా రంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోంది. దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయి. ఇదే విధంగా మరికొన్ని క్రీడలు కూడా కమర్షియలుగా టర్న్ అవుతాయి. ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలి. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదే విధంగా రూపొందించాం. అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇలాంటి వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు చింతిస్తున్నాయి. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ. ఈ బ్రాండ్ మరింతగా పెరగాలి. అందుకే పెట్టుబడులు పెట్టే వారిని రెగ్యులరుగా ఫాలో అప్ చేస్తూనే ఉండాలి. ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే.. పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్ కు మంచి పేరును పరిశీలించండి. రాజధానిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఓ పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉంది "అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

--59వ సీఆర్డీఏ అథార్టీ ఆమోదం పొందిన అంశాలివే..:
* సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయింపు
* పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపు
* పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయింపు
* ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2316 కోట్లకు పరిపాలనా అనుమతులు.
* రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం


## 13న రైతుల ఖాతాల్లోకి..
# పీఎం కిసాన్ నిధులు





ఈ కబురు, దిల్లీ:
రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమ కానున్నాయి. అస్సాంలోని గువహాటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎంకిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. ఈ దఫా మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నారు.

## అమెరికాకు రక్షణ కవచాల కొరత!



ఈ కబురు ;
''మేం ఆయుధాల కొరతను ఎదుర్కోవడం లేదు. ఎప్పుడూ లేనంతగా మా దగ్గర నిల్వలు ఉన్నాయి'' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం చెబుతున్నా.. రక్షణ నిపుణులు మాత్రం ఇందుకు భిన్నంగా స్పందిస్తున్నారు. ఇరాన్‌తో యుద్ధం మూడు నుంచి నాలుగు వారాలు దాటి కొనసాగితే ఆయుధాల కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20 వేల నుంచి 50 వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒకొక్క ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. ఆర్థికపరమైన ఈ అంతరం యుద్ధంలో అమెరికాపై ప్రభావం చూపనుందని నిపుణులు అంటున్నారు. పోరు మొదలైన 100 గంటల్లోనే 2 వేలకు పైగా స్మార్ట్ బాంబులను అగ్రరాజ్యం ప్రయోగించింది. వీటి ఖరీదే.. 3.7 బిలియన్ డాలర్లు. అంతేకాదు.. వందల సంఖ్యలో ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణులను అడ్డుకోవడానికి అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఇంటర్‌సెప్టర్లను అగ్రరాజ్యం వినియోగించాల్సి వస్తోంది. అత్యంత ఖరీదైన గగనతల రక్షణ వ్యవస్థలతో(పేట్రియాటిక్, థాడ్) ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో వీటి నిల్వలు భారీగా తరిగిపోతున్నాయని వార్తలొస్తున్నాయి.

# ఇరవయ్యేళ్లు ఇబ్బందుల్లేకుండా..




ఈకబురు,హైదరాబాద్: వ్యవసాయేతర భూములు, ఆస్తుల క్రయవిక్రయ లావాదేవీల కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత పదేళ్ల కాలంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య (భూములు, ఆస్తుల క్రయ విక్రయ లావాదేవీలు) నాలుగు రెట్లు పెరిగిన నేపథ్యంలో వచ్చే 20 ఏళ్ల కాలానికి తగిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పోర్టల్‌ను నిర్వహిస్తున్న నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సహకారంతోనే మరో 20 ఏళ్ల పాటు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించాలని సర్కారు భావిస్తోంది. ఈ కార్యక్రమానికి అవసరమైన నిధులు వచ్చే బడ్జెట్‌లో కేటాయించనున్నారు. దాదాపు రూ.10 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తుండగా, ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ చేసిన ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్టు సమాచారం.

ఏకీకృత పోర్టల్ తరహాలోనే..!
ప్రస్తుతం రాష్ట్రంలో భూముల వివరాలు, సర్వే, రిజిస్ట్రేషన్ల వివరాలు వేర్వేరు డొమైన్లలో అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ మొత్తం డేటా, ఇతర సమాచారాలను సమీకృతం చేస్తూ ఏకీకృత పోర్టల్ తీసుకురావాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగా ఏకీకృత పోర్టల్ తరహాలోనే స్టాంపుల శాఖ సాఫ్ట్‌వేర్‌ను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రానున్న ఇరవై ఏళ్ల సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు, రోజువారీ కార్యకలాపాలను నియంత్రించే సర్వర్లతో సహా ఇతర అంశాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పోర్టల్‌కు కొత్త సొబగులు అద్దనున్నారు.
ఈ బాధ్యతలు తీసుకున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఎప్పటికప్పుడు ఇందుకు అవసరమైన సమాచారం తీసుకుంటూ, ఎన్ఐసీతో సమన్వయం చేసుకుంటూ 2047 వరకు ఉపయోగపడేలా సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించే పనిలో నిమగ్నమయ్యారు. మరో ఆరు నెలల్లోపు ఈ ప్రకియ పూర్తవుతుందని, 20 ఏళ్ల పాటు రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహించే క్రయ విక్రయ లావాదేవీలకు ఎలాంటి అవాంతరాలు లేని కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తుందని తెలుస్తోంది.

## ఆ ధైర్యం చేయకండి
# .. పిటిషనర్లపై సుప్రీం ఫైర్

ఈ కబురు, దిల్లీ:
జ్యుడిషియల్ అధికారులను ప్రశ్నిస్తూ.. పిటిషన్ దాఖలు చేసిన పలువురిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్ల వివరాలు వెరిఫై చేసేందుకు అత్యున్నత న్యాయస్థానం నియమించిన జ్యుడిషియల్ అధికారులపై అనుమానాలు వ్యక్తం చేయడాన్ని తప్పు పట్టింది. అప్పీళ్లను పరిశీలిస్తున్న అధికారులను ప్రశ్నించే ధైర్యం చేయొద్దని హెచ్చరించింది. అధికారులు ఇప్పటికే ఓవర్ టైం పని చేస్తున్నారని.. వారిని ఇంకేం చేయమంటారని అసహనం వ్యక్తం చేసింది. వారిపై ఫిర్యాదులు చేస్తే సహించబోమంది. పేర్ల తీసివేతపై అభ్యంతరం తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించలేదని ఆరోపిస్తూ.. దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రజల అప్పీళ్లను పరిశీలిస్తున్న జ్యుడిషియల్ అధికారులకు తగిన సాయం, లాజిస్టికల్ మద్దతు అందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బెంగాల్ ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించారు. సర్ ప్రక్రియలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా వస్తున్న అప్పీళ్లను విచారించడానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతో కూడిన అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జ్యుడిషియల్ అధికారులు తిరస్కరించిన ఓటర్ల అభ్యంతరాలను నూతన ట్రైబ్యునల్ పరిశీలిస్తుందని తెలిపారు.

## బెంగళూరులో డెలాయిట్ సైబర్ భద్రతా కార్యాలయం




బెంగళూరు: డెలాయిట్ ఇండియా బెంగళూరులో 'కనెక్ట్‌సేఫ్' పేరుతో సైబర్ భద్రతా కార్యాలయాన్ని ప్రారంభించినట్లు మంగళవారం ప్రకటించింది. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా కార్యాలయాన్ని 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. కీలకమైన మౌలిక సదుపాయాలు, కనెక్టెడ్ ఎకోసిస్టమ్స్‌ను పరిరక్షించడమే లక్ష్యంగా ఈ సైబర్ భద్రతా కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించింది. ఆటోమోటివ్, మెడికల్ టెక్నాలజీ (మెడ్‌టెక్), వినియోగదారు పర్యావరణ వ్యవస్థలతో పాటు వివిధ పరిశ్రమల్లో వాస్తవ ప్రపంచ సైబర్ ముప్పు దృశ్యాలను ఇది పరిశీలిస్తుంది. సంప్రదాయ డేటా భద్రత నుంచి ఆపరేషనల్ టెక్నాలజీ (ఓటీ), మానవ జీవితాలను రక్షించడం, హైపర్‌కనెక్టెడ్ వ్యవస్థల్లోని లోపాలను పరిష్కరించేందుకు సూచనలు చేస్తుందని కంపెనీ తెలిపింది. స్మార్ట్ ఫ్యాక్టరీలు, విద్యుత్ వ్యవస్థల నుంచి వాహనాలు, వైద్య పరికరాల వరకు పరిశ్రమలు ఎక్కువగా అనుసంధానం అయినందున, సైబర్ బెదిరింపులు ఇకపై ఐటీ వ్యవస్థలకే పరిమితం కావని, మన ఆర్థిక వ్యవస్థను నేరుగా ప్రభావితం చేస్తాయ'ని డెలాయిట్ దక్షిణాసియా సీఈఓ రోమల్ శెట్టి వెల్లడించారు.

## అదనంగా వసూలు చేసిన ఎస్‌టీటీ వెనక్కిచ్చేయండి

దిల్లీ: 202324, ఆ ముందు సంవత్సరాలకు సెక్యూరిటీల లావాదేవీల పన్నును (ఎస్‌టీటీ) నిర్దిష్ట మొత్తం కంటే ఏమైనా ఎక్కువగా వసూలు చేసి, ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయకుంటే.. ఆ వివరాలను తమకు తెలియజేయాలని బ్రోకర్లకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) సూచించింది. ఎక్కువగా వసూలు చేసిన ఎస్‌టీటీ మొత్తాన్ని, ఆలస్యమైన ప్రతి నెలకు 1% వడ్డీతో కలిపి ఎన్‌ఎస్‌ఈకి చెల్లించాలని తెలిపింది. ఆ తర్వాత దీనిని ప్రభుత్వ ఖాతాలో ఎక్స్ఛేంజీ జమ చేస్తుందని పేర్కొంది. ఆదాయపు పన్ను విభాగ ఆదేశాల మేరకు బ్రోకర్లకు ఎన్‌ఎస్‌ఈ ఈ సూచన చేసింది. ఈ విషయంలో బ్రోకర్లకు ఏమైనా సందేహాలు ఉంటే వాటిని తీర్చేందుకు అధికారులను ఎన్‌ఎస్‌ఈ నియమించింది. సెక్యూరిటీల క్రయ, విక్రయాలపై ఎస్‌టీటీని బ్రోకరేజీ సంస్థలు వసూలు చేస్తుంటాయి. కొందరు బ్రోకర్లు నిర్దిష్ట మొత్తం కంటే ఎక్కువగా ఎస్‌టీటీ వసూలు చేసి, ప్రభుత్వ ఖాతాలో జమ చేయకుండా, తమ వద్దే అట్టే పెట్టుకున్నట్లు గుర్తించామని మంగళవారం ఎన్‌ఎస్‌ఈ తెలిపింది.

## చమురు 90 డాలర్లయినా విమానయాన సంస్థలకు ఇబ్బందే



**ముడి చమురు బ్యారెల్ ధర 90 డాలర్ల వద్ద ఉన్నా, విమానయాన సంస్థలకు ఇబ్బందులు తప్పవని స్పైస్‌జెట్ ఛైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు. విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర అధికమవుతుంది కనుక, విమాన టికెట్ ధరలు పెంచాల్సి వస్తుందని పేర్కొన్నారు. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో ఇంధనం వాటానే 40% వరకు ఉండటం ఇందుకు కారణమని చెప్పారు. సంస్థల విస్తరణ ప్రణాళికలపైనా ఒత్తిడి పడుతుందని వివరించారు.**

**ఇప్పటికే టికెట్ ధరలు 15% పెరిగాయ్: వార్తా సంస్థ బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, విమానయాన సంస్థలు ఇప్పటికే టికెట్ ధరలను పెంచుతున్నాయి. కొన్ని విమాన సర్వీసులను నిలిపివేస్తున్నాయి. 1970 తర్వాత తలెత్తిన భారీ చమురు సంక్షోభం నేపథ్యంలో, సుదూర మార్గాల టికెట్ ధరలను ఆయా సంస్థలు 15% పెంచాయి. ఏటీఎఫ్ ధరకు అనుగుణంగా త్వరలో మరింత పెంచే అవకాశాలున్నాయని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి.**

# దేశంలో గరిష్ఠ వార్షిక వేతనం రూ.8 కోట్లు




దేశంలో ప్రైవేటు ఈక్విటీ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో పెద్ద హోదాల్లో ఉన్నవారికి భారీ ప్యాకేజీలు లభిస్తున్నాయి. దీంతోపాటు వర్ధమాన రంగాల్లో నైపుణ్యం ఉన్నవారికీ గిరాకీ అమాంతం పెరిగింది. ఇంజినీరింగ్, తయారీ, ఫార్మా, మానవ వనరుల విభాగాల్లో ఉన్నతోద్యోగులకు రూ.కోట్లలో వార్షిక వేతనాలు లభిస్తుండగా.. ఏఐ, సెమీకండక్టర్, విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం వంటి కొత్త గిరాకీ రంగాల్లో వేతనాలు 30% వరకు పెరగొచ్చని అంచనా. ఇండియా శాలరీ గైడ్ 2026 పేరిట మైఖేల్ పేజ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం..

ఆర్థికనాయకత్వ పాత్రల్లోని వారికి..

సీనియర్ కార్పొరేట్ ఫైనాన్స్ నాయకత్వ హోదాల్లో ఉన్నవారికి అత్యధిక వేతన ప్యాకేజీలందుతున్నాయి. రూ.10,000 కోట్ల ఆదాయం కంటే ఎక్కువ ఉన్న సంస్థల ముఖ్య ఆర్థిక అధికారు (సీఎఫ్‌ఓ)లకు వార్షిక వేతనం రూ.1.75 8 కోట్ల వరకు ఉంటోంది. రూ.5,00010,000 కోట్ల ఆదాయార్జన ఉండే కంపెనీల సీఎఫ్‌ఓలు రూ.1.5 4 కోట్ల వరకు, రూ.10005000 కోట్ల మధ్య ఆదాయం ఉండే సంస్థల్లో రూ.1 3 కోట్ల వరకు ప్యాకేజీ ఈ స్థాయి అధికారులకు లభిస్తోంది.

కార్పొరేట్ ఫైనాన్స్, ట్రెజరీ ఉద్యోగాల్లో 1015 ఏళ్ల అనుభవం ఉన్నవారు రూ.65 లక్షలురూ.1.2 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకుంటున్నారు. పీఈ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్..

భారత ఆర్థిక సేవల రంగంలో అత్యంత లాభదాయకత ప్రైవేటు ఈక్విటీ(పీఈ)లకు ఉంటోంది. అంతర్జాతీయ పీఈ సంస్థల ఎండీలు ఏటా రూ.46 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకుంటుంటే, డైరెక్టర్లు రూ.1.854 కోట్ల వరకు సంపాదిస్తున్నారు. బహుళజాతి బ్యాంకుల్లో విలీనాలుకొనుగోళ్లు, కార్పొరేట్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్‌లో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయి ఉన్న వారు రూ.5590 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. డైరెక్టర్లు, ఎండీలకు వరుసగా రూ.11.5 కోట్లు; రూ.2.54 కోట్ల ప్యాకేజీ ఉంటోంది.

తయారీ, ఇంజినీరింగ్ వేతనాలు పైకి

తయారీ సంస్థల్లో ముఖ్య కార్యనిర్వాహక అధికారులు (సీఓఓ) రూ.13 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకుంటున్నారు. లాభనష్టాలకు బాధ్యత వహించే వ్యక్తులు రూ.1.56 కోట్ల వరకు తీసుకుంటున్నారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్‌లో 1520 ఏళ్ల అనుభవం ఉన్నవారు రూ.50 లక్షల నుంచి రూ.1.5 కోట్ల దాకా పొందుతున్నారు. సస్టెయినబిలిటీ, ఏఐ (కృత్రిమమేధ), వ్యూహాత్మక పెట్టుబడుల కంపెనీల్లో నిపుణులకు 3550% వేతన పెంపు లభిస్తోంది.

ఆరోగ్య సంరక్షణ, ఫార్మాలో ఏఐ

ఆరోగ్య, లైఫ్‌సైన్సెస్ రాగాల్లో ఏఐ పాత్ర పెరుగుతోంది. డయాగ్నొస్టిక్స్, క్లినికల్ రీసెర్చ్, డ్రగ్ డిస్కవరీలో ఏఐని ఉపయోగిస్తున్నారు. ఫార్మా విక్రయాల్లో 25 ఏళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ రూ.65 లక్షలు 1.2 కోట్లు చేజిక్కించుకుంటున్నారు. వైద్య పరికరాల కంపెనీల ఉన్నతాధికార్లు గరిష్ఠంగా రూ.3.5 కోట్ల వార్షిక వేతనాన్ని పొందుతున్నారు.

కోట్ల క్లబ్‌లోకి హెచ్‌ఆర్ విభాగమూ..

టాలెంట్ మేనేజ్‌మెంట్, వర్క్‌ఫోర్స్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఉన్న కంపెనీల్లోని మానవ వనరుల(హెచ్‌ఆర్) అధికారుల వేతనాలూ పెరగుతున్నాయి. పెద్ద సంస్థల హెచ్‌ఆర్ అధిపతులు రూ1.54 కోట్లు అందుకుంటుంటే, 15 ఏళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్‌కు రూ.11.8 కోట్ల దాకా వస్తోంది.

ఉద్యోగం మారినపుడు 3040% వేతన పెంపు

సామర్థ్యం ఉన్నవారికే సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అందుకే అధునాతన నైపుణ్యాలు కలిగిన వారు ఉద్యోగం మారితే 3040% వేతన పెంపును పొందగలుగుతున్నారు. గతంలో ఈ తరహా వేతన పెంపు సగటు 9.1 శాతమే.

ఏఐ, మెషీన్ లెర్నింగ్ నిపుణులకు ఉద్యోగాలు ఏడాది కిందటితో పోలిస్తే 49% పెరిగాయి. సెమీకండక్టర్స్, బ్యాటరీ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీలో నిపుణుల కోసం కంపెనీలు తీవ్రంగా వెతుకుతున్నాయి. ఫిన్‌టెక్, క్లినికల్‌రీసెర్చ్‌లో ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారిని 2035% వేతన పెంపుతో తీసుకుంటున్నారు.

జీసీసీలతో అధిక ఉపాధి: దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)ల వృద్ధి, ఏఐ ఆధారిత వినూత్నత పెరగడంతో.. సంబంధిత ప్రత్యేక నైపుణ్యం ఉన్న వారికి గిరాకీ భారీగా పెరిగింది. బెంగళూరు, హైదరాబాద్, పుణె, దిల్లీ వంటి భారతీయ నగరాల్లో బహుళజాతి కంపెనీలు పరిశోధనఅభివృద్ధి కేంద్రాలను నెలకొల్పడానికి కారణం ఇదే.


ఈ నిపుణులకు అధిక గిరాకీ: అనుభవం కన్నా నైపుణ్యం ఉన్నవారికే అధిక వేతనాలు లభిస్తున్నాయి.

- ఏఐ, మెషీన్ లెర్నింగ్
- సెమీకండక్టర్స్
- ఈవీ, బ్యాటరీ టెక్నాలజీ
- రెన్యూవబుల్ ఎనర్జీ

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిపుణులకు వేతన పెంపులు భారీగా ఉంటున్నాయి.

రూ.20 లక్షలు + ప్యాకేజీ దూకుడు: ఐటీ రంగంలో ఈ వేతన విభాగం వేగంగా వృద్ధి చెందుతోంది. జూనియర్ డెవలపర్లను భారీగా తీసుకోవడానికి బదులు, మధ్య సీనియర్‌స్థాయిలో నైపుణ్యం ఉన్న వారి వైపు కంపెనీలు అడుగులు వేయడం ఇందుకు ప్రధాన కారణం.

# అల్యూమినియం ధరలు పెరుగుతున్నాయ్



దిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం వల్ల, సరఫరా అంతరాయాలు కలుగుతాయన్న భయాల మధ్య అంతర్జాతీయంగా అల్యూమినియం ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం టన్ను ధర 3400 డాలర్లకు చేరింది. స్వల్పకాలంలో భారత ఉత్పత్తిదార్లకు ఈ ధరలు ప్రయోజనాన్ని అందించినా, దీర్ఘకాలంలో ముడిపదార్థాల వ్యయాల రూపంలో సవాళ్లు విసరొచ్చని భారతీయ ఖనిజ పరిశ్రమల సమాఖ్య(ఫిమి) అంటోంది. పశ్చిమాసియాలోని కొన్ని అల్యూమినియం స్మెల్టర్లు ఉత్పత్తి నిలిపివేసి, ఎగుమతులను తాత్కాలికంగా ఆపేశాయి. ఖతార్‌లోని ఖతాలమ్ స్మెల్టర్ షట్‌డౌన్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్త అల్యూమినియం ఉత్పత్తిలో దాదాపు 89% పశ్చిమాసియా నుంచే వస్తోందని ఫిమి పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో అవాంతరాల వల్ల అల్యూమినియం తయారీలో కీలక ముడి పదార్థమైన కాల్సినైడ్ పెట్రోలియం కోక్(సీపీసీ) దిగుమతులపై ప్రభావం పడుతుంది. దేశీయ స్మెల్టర్లకు ఉత్పత్తి వ్యయాలను పెంచుతుందని వివరించింది.

నాల్కో, హిందాల్కో, వేదాంతా వంటి కంపెనీలు ఏటా 4 మిలియన్ టన్నుల అల్యూమినియం ఉత్పత్తి చేస్తున్నాయి. ఇవి సీపీసీ దిగుమతుల కోసం అమెరికా, పశ్చిమాసియాపై అధికంగా ఆధారపడుతున్నాయి. వేదాంతా తన అల్యూమినియం వ్యాపార విస్తరణ కోసం రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెడుతుండగా, నాల్కో తన కొత్త స్మెల్టర్, బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ కోసం వచ్చే అయిదేళ్లలో రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.

బీమా విషయంలో సహాయం చేస్తాం

వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం నుంచి తప్పించుకునేందుకు బీమా విషయంలో ఎగుమతిదార్లకు సహాయం చేయాలని కేంద్రం భావిస్తోందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. రోజూ పరిణామాలను అంతర్ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తూనే ఉందని, ఎగుమతిదార్లతో చర్చలు జరుపుతూనే ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే భారత పోర్టులకు తిరిగి వస్తున్న నౌకలకు కస్టమ్స్ విభాగం నిబంధనలను ప్రకటించిందనీ, ఇదే తరహాలో బీమా మద్దతు వంటి ఇతర కొత్త పథకాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ విషయంలో ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్(ఈసీజీసీ) తదితర విభాగాలతో చర్చిస్తున్నామన్నారు.

# రష్యా చమురు చెల్లింపులకు ఎస్‌బీఐ దూరం!

**రష్యా నుంచి మన దేశీయ సంస్థలు చమురు దిగుమతి చేసుకోవడానికి అమెరికా 30 రోజుల పాటు మినహాయింపు ఇచ్చినా కూడా.. వాటికి సంబంధించిన చెల్లింపులను ప్రాసెస్ చేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరాకరిస్తోందని సమాచారం. మినహాయింపు కాలవ్యవధిపై అనిశ్చితి నెలకొనడమే ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపినట్లు వార్తాసంస్థ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ప్రపంచ దేశాల్లో కూడా ప్రాజెక్టులకు ఎస్‌బీఐ భారీ స్థాయిలో రుణాలు అందచేసింది. అమెరికా ఆంక్షలున్న చమురు సంబంధిత లావాదేవీల్లో పాలుపంచుకుంటే, రిస్క్ పెరగడంతో పాటు బ్యాంక్ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందన్నది ఎస్‌బీఐ భావనగా తెలుస్తోంది. ఈ వార్తలపై స్పందించేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. గత అక్టోబరులో రష్యాలోని రెండు అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తి సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించినప్పటి నుంచి, ఆ దేశం నుంచి చేసుకునే చమురు దిగుమతులకు సంబంధించిన ఎటువంటి ఆర్థిక లావాదేవీలను ఎస్‌బీఐ ప్రోత్సహించడం లేదు. ఇప్పుడు అమెరికా ఆంక్షలు సడలించినా కూడా, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లకు మద్దతుగా ఉన్న ఆర్థిక మార్గాలను పునరుద్ధరించడంలో ఎస్‌బీఐ ఆసక్తి కనబరచడం లేదు. గతేడాది చివర్లో రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు కొన్ని భారత బ్యాంకులు ఆర్థిక సాయం చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. లావాదేవీలు బ్లాక్ లిస్ట్‌లో లేకుండా, నిబంధనలకు లోబడి ఉన్నంత వరకు.. వాటిని పరిశీలిస్తామని ఆ బ్యాంకులు తెలిపాయి.**

**భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, అమెరికాలో తన వ్యాపార ప్రయోజనాలను కాపాడుకోవడానికే ఎస్‌బీఐ ఈ వైఖరి పాటిస్తోంది. డిసెంబరు చివరకు ఎస్‌బీఐ మొత్తం అంతర్జాతీయ రుణాలు రూ.6.93 లక్షల కోట్లు (75.1 బి.డాలర్లు)గా ఉన్నాయి. ఇందులో అమెరికా వాటా 26%.**



## సురక్షితంగా చెన్నై చేరుకున్న నటుడు అజిత్



చెన్నై: నటుడు అజిత్ (Ajith) దుబాయ్ నుంచి సురక్షితంగా చెన్నై చేరుకున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడి చేయడంతో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో, దుబాయ్ నుంచి కొన్ని రోజుల క్రితమే అజిత్ రావాల్సి ఉండగా.. గగనతలంపై ఆంక్షలు విధించడంతో రాలేకపోయారు. మంగళవారం చేరుకున్నారు. అజిత్ ప్రొఫెషనల్ రేసర్ అనే విషయం విదితమే. మోటార్‌స్పోర్ట్స్ ఈవెంట్స్ కోసం అజిత్ ఇటీవల ఎక్కువగా దుబాయ్‌లోనే ఉంటున్నారు.



## రామోజీ ఫిల్మ్ సిటీలో 'ఫౌజీ' సందడి

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు హను రాఘవపూడి కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'ఫౌజీ'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇమాన్వీ కథానాయిక. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ప్రత్యేక సెట్‌లో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇది 1940ల నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోంది. దేశభక్తి, ప్రేమ అంశాలతో మిళితమైన భావోద్వేగాలతో నిండిన కథగా ఉంటుంది. ఇది ఈ ఏడాది దసరాకి థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి విశాల్ ఛటర్జీ సంగీతమందిస్తున్నారు.

### కలిసింది అందుకేనా?

'కిష్కింధకాండ', 'ఎకో' చిత్రాలతో అటు మలయాళంతో పాటు ఇటు తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు దింజిత్ అయ్యతన్. ఆయన తాజాగా కథానాయకుడు ప్రభాస్‌ని కలిసినట్లు ఫొటో పంచుకోవడం.. ఈ మీటింగ్‌ని ఏర్పాటు చేసినందుకు హోంబలే ఫిల్మ్స్ నిర్మాత విజయ్ కిరగందూర్‌కు దింజిత్ కృతజ్ఞతలు తెలపడం ఆసక్తికరంగా మారింది. త్వరలో వీళ్ల కలయికలో ఏమైనా కొత్త కబురు వినిపిస్తారేమోనని చర్చలు మొదలయ్యాయి. నిజానికి 'సలార్' తర్వాత ప్రభాస్‌తో మరో మూడు చిత్రాలు చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ గతంలో ప్రకటించింది. కానీ, దర్శకులెవరన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడీ సంస్థ ద్వారానే దింజిత్ ఆయన్ని కలిసినట్లు చెప్పడం.. కొత్త సినిమా కోసమేనా అనే చర్చ మొదలైంది. దీనిపై ఆ దర్శకుడు స్పష్టత ఇవ్వనప్పటికీ.. ప్రభాస్‌తో సాగిన గొప్ప సంభాషణలు.. ఆయన ఆతిథ్యం, తనందించిన విందు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# వీరనారి సత్యవతి

ఘాజీ', 'అంతరిక్షం' చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి. ఇప్పుడాయన గోపీచంద్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని తెరకెక్కి స్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. చారిత్రక డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రంలో కథానాయికగా రీతూ వర్మ నటిస్తున్నారు. ఆ విషయాన్ని చిత్రబృందం మంగళవారం ప్రకటిస్తూ, సినిమాలో రీతూవర్మ పోషిస్తున్న పాత్ర లుక్‌ని విడుదల చేసింది. విల్లు ఎక్కుపెట్టి ఓ యోధురాలి లుక్‌లో కనిపిస్తున్న రీతూవర్మ... ఇందులో 7వ శతాబ్దానికి చెందిన సత్యవతి అనే శక్తిమంతమైన గిరిజన మహిళగా నటిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. వెలుగు చూడని చరిత్రలోని ఓ అధ్యాయంతో రూపొందుతున్న చిత్రమిదని, కథానాయకుడు గోపీచంద్ కూడా ఇందులో ఓ వీరుడిగా అలరించనున్నారని స్పష్టం చేశాయి. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీపైనా స్పష్టత రానుంది.



## పురస్కారాలు తీసుకునే అర్హత నాకు ఉన్నట్లే!: రాజేంద్ర ప్రసాద్



"జానపద చిత్రాల్లో తనకు సాటి మరొకరు లేరని నిరూపించిన నటుడు కాంతారావు. అలాంటి గొప్ప నటుడి పేరుతో ఏర్పాటైన పురస్కారం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నా" అన్నారు ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన 'కత్తి కాంతారావు జాతీయ పురస్కారం 2025'ని స్వీకరించారు. భారత కల్చరల్ అకాడమీ, తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలచారి, ఐఏఎస్ అధికారి సి.పార్థసారథి, ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, సీనియర్ నటి కవిత, తెలంగాణ ఎఫ్.డి.సి ఎండీ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "నటుడిగా 48 ఏళ్ల సుదీర్ఘ అనుభవం నాది. ఐదు తరాల హీరోలతో కలిసి నటించే అదృష్టం నాకు దక్కింది. రామారావు, నాగేశ్వరరావు తెలుగు చిత్ర పరిశ్రమకు రెండు కళ్లు అయితే, కాంతారావు తిలకంలాంటి వారు. లవకుశ చిత్రంలో లక్ష్మణుడి పాత్రలో ఆయన చిరస్మరణీయమైన నటనని ప్రదర్శించారు. మనకు నారదుడు అంటే కాంతారావు తప్ప మరొకరు గుర్తుకు రారు. గత నలభై ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా తెలుగువాళ్లు నా సినిమాలు చూసి వాళ్ల జీవితాల్లోని కష్టాల్ని మరిచిపోతున్నారంటే నటుడిగా నాకు సార్థకత చేకూరినట్లే. ఇలాంటి పురస్కారాలు తీసుకునే అర్హత నాకు ఉన్నట్లే" అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ప్రేమ్‌రాజ్, విజన్ వీవీకే అధినేత విజయ్‌కుమార్, నాగబాల డి. సురేశ్‌కుమార్, వెనిగళ్ల రాంబాబు, చిత్తరంజన్, అక్కినేని శ్రీధర్, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రవితేజ చిత్రంలో తమన్నా?






కాస్త విరామం వచ్చేసిందనే అభిప్రాయం కలిగేలోపే తెలుగులో మరో కీలకమైన అవకాశాన్ని సొంతం చేసుకుని రేసులోకి వచ్చేస్తుంటుంది తమన్నా. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆమె తెలుగు చిత్ర పరిశ్రమలో తరచూ అవకాశాల్ని అందిపుచ్చు కుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది. ఈ మధ్య హిందీలోనే ఎక్కువగా నటిస్తున్న ఆమె... త్వరలోనే రవితేజతో కలిసి సందడి చేయనుందని తెలుస్తోంది. రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఇరుముడి' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తోంది. ఇందులో మరో కీలక పాత్ర ఉంటుందని, ఆ పాత్ర కోసం తమన్నాని ఎంపిక చేశారని సమాచారం. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. తండ్రీ కూతురు మధ్య అనుబంధం, భక్తి మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిది.

## అవతార్ 4'.. జేమ్స్ కామెరూన్ ఆలోచనలో పడ్డారా? స్పందన ఇదే!

'అవతార్'తో సినీ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు జేమ్స్ కామెరూన్ (James Cameron). ఆ చిత్రానికి కొనసాగింపుగా మరో రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, మొదటి సినిమాతో పోలిస్తే, తర్వాత వచ్చిన చిత్రాలు విజువల్ వండర్స్‌గా అలరించినా, బలమైన కథా వస్తువు లేకపోవడం మైనస్‌గా మారింది. వసూళ్లపరంగా మాత్రం రెండూ బాగానే మెప్పించాయి. ఇక ఈ ఫ్రాంఛైజీలో మొత్తం 5 సినిమాలను (Avatar movie series) తీసుకురానున్నట్లు జేమ్స్ కామెరూన్ ఇప్పటికే ప్రకటించారు. మూడు సినిమాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రాగా, 'అవతార్4' (Avatar 4 update) అప్‌డేట్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

తాజాగా జరిగిన శాటర్న్ అవార్డుల వేడుకలో జేమ్స్ కామెరూన్ నాలుగో పార్ట్‌పై స్పందించారు. ప్రస్తుతానికి దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. "సీక్వెల్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ, సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం పుష్కలంగా ఉంది. ఈ విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుంటాం. ఇప్పటివరకూ వచ్చిన మూడు చిత్రాలను మరోసారి సమీక్షించుకుని ముందుకు వెళ్తాం" అని అన్నారు.



మొదటి పార్ట్ ఇచ్చినంత కిక్.. ఆ తర్వాత వచ్చిన రెండు, మూడు పార్ట్‌లు ఇవ్వలేదన్నది జగమెరిగిన సత్యం. మరీ ముఖ్యంగా ఒకే కథను నేపథ్యం మార్చి విజువల్స్‌తో మాయ చేశారన్నది కాదలేని వాస్తవం. ఈ విషయం జేమ్స్ కామెరూన్‌కూ తెలుసు. అందుకే 'అవతార్4' (avatar 4 filming update) విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలను తీసుకుంటానని అంటున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 71 సంవత్సరాలు. వయసు పెరుగుతున్న రీత్యా కామెరూన్ కూడా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందట. రెండు సినిమాలకు సంబంధించిన కథను సిద్ధం చేసుకుని, ఒకేసారి షూటింగ్ కూడా పూర్తి చేసే ఆలోచనలో ఉన్నారట. ఎంత ప్లానింగ్‌తో ముందుకు వెళ్లినా కచ్చితంగా ఈ రెండు సినిమాలకు ఐదారేళ్లు పడుతుంది. ఇప్పటివరకూ కామెరూన్ స్వయంగా ప్రకటించిన తేదీల ప్రకారం 'అవతార్ 4'ని 2029లో, 'అవతార్ 5'ని 2031లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలి.

## మూడు వారాల క్రితం నిర్ణయం తీసుకున్నా.. ఇప్పుడిలా..మంచు మనోజ్



తాను కంఫర్ట్ జోన్ వదిలిపెట్టి, మూడు వారాల పాటు కఠోర వ్యాయామాలు చేసినట్లు నటుడు మంచు మనోజ్ (Manchu Manoj) తెలిపారు. 21 రోజుల్లో శరీరాకృతిని మార్చుకున్నారు. సంబంధిత ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ.. రియల్ స్టంట్స్ మోడ్‌లోకి మళ్లీ తిరిగి వచ్చానన్నారు.

"మూడు వారాల క్రితం నేను ఈ నిర్ణయం తీసుకున్నా. నాకు నేను ఎలాంటి సాకులు చెప్పకోకుండా అనుకున్నది ఎలాగైనా పూర్తి చేయాలని ఫిక్స్ అయ్యా. యాక్షన్ సినిమాలో.. నీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. కెమెరా కూడా అబద్ధం చెప్పదు. ప్రతి పంచ్ నువ్వు ఇవ్వాల్సిందే. అందుకే నిర్దిష్ట లుక్ కోసం కాకుండా అంతకుమించిన దానికోసం శిక్షణ తీసుకోవడం ప్రారంభించా. ఇది కొనసాగుతూనే ఉంటుంది. ఈ 21 రోజుల్లో నాలో మార్పు వచ్చిందని చెప్పగలను" అని పేర్కొన్నారు. 'రియల్‌స్టంట్స్' (#RealStunts), 'డేవిడ్‌రెడ్డి' (#David Reddy) తదితర హ్యాష్‌ట్యాగ్‌లు జోడించారు. తన కొత్త సినిమా 'డేవిడ్‌రెడ్డి' కోసమే ఈ వర్కౌట్స్ చేసినట్లు తెలుస్తోంది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు హనుమరెడ్డి యక్కంటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బ్రిటిష్ వారిపై పోరాడే ఓ యోధుడి కథగా ఈ సినిమా రూపొందుతోంది.

# మహిళల ఫుట్‌బాల్ ఆసియాకప్.. భారత్ ఔట్



ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో భారత అమ్మాయిలు నిరాశపరిచారు. తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడిపోవడంతో.. భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. మంగళవారం గ్రూప్‌సి పోరులో చైనీస్‌తైపీ చేతిలో 13 తేడాతో భారత్ పరాజయం పాలైంది. యు సుయాన్ (12వ నిమిషం) గోల్‌తో చైనీస్ తైపీని ఆధిక్యంలో నిలిపింది. మనీషా కల్యాణి (39) చక్కటి షాట్‌తో గోల్ కొట్టి స్కోర్లు సమం చేసింది. విరామ సమయానికి ముందు యి యున్ (45+9), ద్వితీయార్థంలో యు చిన్ (77) గోల్స్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత్.. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కెప్టెన్, గోల్‌కీపర్‌లకు గాయాలు: పేలవ ప్రదర్శనతో ఆసియా కప్ నుంచి నిష్క్రమించిన భారత మహిళల జట్టుకు మరో ఎదురు దెబ్బ తగిలింది. 83వ నిమిషంలో కెప్టెన్ స్వీటీ దేవి, గోల్‌కీపర్ పంతోయ్ చానూలు ఒకరినొకరు ఢీకొన్నారు. స్వీటీ మోకాలు తగలడంతో పంతోయి ముఖానికి రక్తస్రావం అయింది. దీంతో వీరిద్దరినీ ఆసుపత్రికి తరలించారు.

# ఐపీఎల్ షెడ్యూల్ విడుదల అప్పుడే ..బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా



ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ (IPL) 2026కు సంబంధించి మొదటి 20 రోజుల షెడ్యూల్‌ను బీసీసీఐ (BCCI) మార్చి 12న విడుదల చేయనుంది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా ధ్రువీకరించారు. ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభ తేదీని మార్చినట్లు నిర్వాహకులు అధికారికంగా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో ఈ మెగా టోర్నీని మార్చి 26న ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాజాగా దీన్ని మార్చి 28కి వాయిదా వేసినట్లు ప్రకటించారు. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్లు, ఫ్రాంచైజీలకు కాస్త సమయం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 'మేం ఐపీఎల్ 2026 షెడ్యూలును మార్చి 12న విడుదల చేయనున్నాం. ప్రస్తుతానికి 20 రోజుల షెడ్యూలును మాత్రమే ప్రకటించనున్నాం' అని బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా ఓ వార్తాసంస్థకు మంగళవారం తెలిపారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మిగతా షెడ్యూలును తర్వాత విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్‌లో పాల్గొనబోయే జట్లు ఇప్పటికే తమ ప్రాక్టీస్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

**మార్చి 15న బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం**

'బీసీసీఐ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 15న దిల్లీలో జరగనుంది. టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్‌లతో పాటు ఇతర ఐసీసీ టోర్నమెంట్ విజేతలు, కోచ్‌లను ఆహ్వానించబోతున్నాం. సీనియర్ పురుషుల జట్టుతో పాటు, 2025లో ట్రోఫీని గెలుచుకున్న సీనియర్ మహిళల జట్టు, అండర్ 19 బాలుర జట్టు, అండర్ 19 బాలికల జట్లు రానున్నాయి. 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ టీమ్‌ను కూడా సన్మానించనున్నాం' అని సైకియా పేర్కొన్నారు.

# డ్రా చేసినా సెమీస్‌కు

**వేల్స్‌తో భారత్ పోరు నేడు**



మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో భారత్ బుధవారం వేల్స్‌ను ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌ను కనీసం డ్రా చేసుకున్నా ఆతిథ్య జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంటుంది. భారత్ ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో పూల్‌బిలో అగ్రస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న స్కాట్లాండ్ ఖాతాలో కూడా నాలుగు పాయింట్లే ఉన్నాయి. కానీ మెరుగైన గోల్ వ్యత్యాసం వల్ల భారత్ ముందుంది. పూల్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి. భారత్ తన ఆఖరి పూల్ మ్యాచ్‌లో వేల్స్ చేతిలో ఓడినా.. సెమీస్ రేసులో ఉంటుంది. అప్పుడు అర్హత స్కాట్లాండ్-ఉరుగ్వే మ్యాచ్‌పై ఆధారపడి ఉంటుంది. పూల్‌లో భారత్ తన తొలి మ్యాచ్‌లో 40తో ఉరుగ్వేను చిత్తు చేసింది. ఆ తర్వాత స్కాట్లాండ్‌తో మ్యాచ్‌ను 11తో డ్రాగా ముగించింది. ఈ క్వాలిఫయర్స్‌లో టాప్3లో నిలిచిన జట్లు ప్రపంచకప్‌నకు అర్హత సాధిస్తాయి.

# టీమ్‌ఇండియాకు రూ.131 కోట్లు

## ప్రపంచకప్ విజేతలకు బీసీసీఐ భారీ నజరానా

**టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమ్‌ఇండియా పంట పండింది. సూర్యకుమార్ బృందానికి బీసీసీఐ రూ.131 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. 15 మంది ఆటగాళ్లు, సహాయ సిబ్బంది, ఇతర సహాయ సిబ్బందికి ఈ మొత్తం ఇస్తారు. ఇందులో సింహభాగం ఆటగాళ్లకు దక్కుతుంది. స్థాయిని బట్టి సహాయ సిబ్బందికి ఇచ్చే మొత్తాన్ని నిర్ణయిస్తారు. 2024లో కప్పు గెలిచిన జట్టుకు రూ.125 కోట్లు ఇవ్వగా.. ఇప్పుడు మరో రూ.6 కోట్లు పెంచారు. ఒక్కో ఆటగాడికి రూ.6 కోట్లు ఇచ్చి.. మిగతా రూ.41 కోట్లు సహాయ సిబ్బందికి పంచనున్నట్లు సమాచారం. "చరిత్రాత్మక విజయం సాధించినందుకు ఆటగాళ్లు, సహాయ సిబ్బందికి బీసీసీఐ మరోసారి అభినందనలు తెలుపుతోంది. భవిష్యత్తులోనూ విజయపరంపరను కొనసాగించాలని ఆశిస్తోంది" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఓ ప్రకటనలో చెప్పాడు. ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన టీమ్‌ఇండియా.. టీ20 ప్రపంచకప్‌ను వరుసగా రెండోసారి గెలుచుకున్న తొలి జట్టుగా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కప్పును మూడుసార్లు సొంతం చేసుకున్న తొలి జట్టుగా కూడా భారత్ ఘనత సాధించింది.**



# లక్ష్యసేన్.. లక్ష్య సాధకుడు

**భారత బ్యాడ్మింటన్‌లో పురుషుల సింగిల్స్ అనగానే ఒకప్పుడు ప్రకాశ్ పదుకోన్.. ఆ తర్వాత పుల్లెల గోపీచంద్ గుర్తొచ్చేవారు. కొన్నేళ్ల వరకు కిదాంబి శ్రీకాంత్, ప్రణయ్‌ల పేర్లు వినిపించాయి. ఇప్పుడు మాత్రం అందరి దృష్టి ఒకడి మీదే నిలుస్తోంది. రాకెట్ వేగంతో దూసుకెళ్తూ.. ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న ఆ ఆటగాడే లక్ష్యసేన్. తాజాగా ప్రతిష్ఠాత్మక ఆల్ఇంగ్లాండ్‌లో అద్భుత ప్రదర్శనతో ప్రపంచ బ్యాడ్మింటన్‌లో తన పేరు మార్మోగేలా చేసుకున్నాడు.**

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతన టోర్నీ.. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్. ఈ టోర్నీలో విజేతగా నిలిస్తే ఒలింపిక్స్‌లో పతకం గెలిచినట్లుగా భావిస్తారు. అలాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో.. గత వారం లక్ష్యసేన్ సంచలనాలు సృష్టించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ షి యుకి (చైనా)కి షాకిచ్చి ప్రకంపనలు రేపాడు. క్వార్టర్‌ఫైనల్లో ఏడో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)ను చిత్తుచేసి మరో అసాధారణ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఫైనల్లో చైనీస్ తైపీ ఆటగాడు లిన్ చున్ చేతిలో ఓడిన లక్ష్యసేన్.. కెరీర్‌లో రెండోసారి ఆల్ ఇంగ్లాండ్ రన్నరప్‌గా నిలిచాడు. సైనా నెహ్వాల్, సింధు, శ్రీకాంత్ తర్వాత భారత బ్యాడ్మింటన్‌లో స్థిరంగా రాణిస్తోంది లక్ష్యసేన్ మాత్రమే. 24 ఏళ్ల ఈ ఉత్తరాఖండ్ షట్లర్.. తక్కువ సమయంలోనే భవిష్యత్ తారగా ఎదిగాడు. బెంగళూరులో ప్రకాశ్ పదుకోన్, విమల్ కుమార్ లాంటి దిగ్గజాల మార్గనిర్దేశంలో రాటుదేలిన లక్ష్య.. 2017లో ప్రపంచ జూనియర్ నంబర్‌వన్‌గా అవతరించాడు. 2019లో డచ్ ఓపెన్‌తో మొదలైన సీనియర్ స్థాయి ప్రస్థానం ఆ తర్వాత జోరందుకుంది. 2022లో చరిత్రాత్మక థామస్ కప్ విజయంలో కీలకపాత్ర పోషించిన లక్ష్య.. 2022 కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణంతో మెరిశాడు. అదే ఏడాది ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్లో ఫైనల్ చేరినా.. రన్నరప్ ట్రోఫీ దక్కింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకం చేజారింది. సెమీఫైనల్లో విక్టర్ అక్సెల్‌సెన్ చేతిలో ఓడిన అతడు.. కాంస్య పతక పోరులో లీ జియాకు తలొంచాడు. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన లక్ష్యసేన్.. హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. కెరీర్‌లో ఇప్పటిదాకా ప్రపంచ టూర్ సూపర్ సిరీస్‌లలో నాలుగు సార్లు, ఛాలెంజర్ టోర్నీల్లో మూడు సార్లు లక్ష్యసేన్ రన్నరప్ ట్రోఫీలు అందుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్ వైఫల్యం, గాయాలతో ర్యాంకింగ్స్‌లో టాప్10లో చోటు కోల్పోయిన లక్ష్యసేన్.. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. తాజాగా ఆల్ ఇంగ్లాండ్‌లో సత్తాచాటిన అతడు.. రెట్టించిన ఉత్సాహంతో ఆసియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లను ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నాడు. కోచ్‌ల సలహాలతో శిక్షణ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ.. రాబోయే సీజన్ మొత్తం ఫిట్‌గా ఉండేలా వ్యూహాలు రచించుకుంటున్నాడు. "ప్రస్తుతం పురుషుల సింగిల్స్‌లో శారీరక శ్రమ విపరీతంగా పెరిగిపోయింది. అందుకు తగ్గట్లుగా శిక్షణ, కోలుకునే ప్రక్రియలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. నాకిప్పుడు 20 ఏళ్లు కాదు. వయసు పెరుగుతున్నకొద్దీ 2122 ఏళ్ల మాదిరిగా దేహం వేగంగా కోలుకోదు. అప్పట్లో ఏది తిన్నా బరువు పెరిగేవాడిని కాదు. కాని ఇప్పుడు



ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. గతంలో భుజం గాయాలు వేధించడంతో అటాకింగ్ షాట్లపై ప్రభావం పడింది. ఇప్పుడు పనిభారాన్ని సరిగ్గా నిర్వహించుకోవడంపై దృష్టిసారిస్తున్నా. మానసిక శిక్షకుడు మోన్ బ్రాక్‌మన్‌తో పనిచేయడం కలిసొస్తోంది. నా మానసిక స్థితిలో ఎంతో మార్పొచ్చింది. 2022లో తొలిసారి ఆల్ ఇంగ్లాండ్ ఫైనల్ చేరినప్పుడు కలలా అనిపించింది. ఈసారి క్వార్టర్స్, సెమీస్ ఆడుతున్నప్పుడే టైటిల్ గెలవగలనన్న నమ్మకం నాలో కలిగింది'' అని అంటున్నాడు లక్ష్యసేన్. శారీరకంగా, మానసికంగా అత్యుత్తమ స్థితిలో ఉంటే మాత్రం లక్ష్యసేన్ ఎంతటి ఆటగాడినైనా చిత్తుచేస్తాడనడానికి ఆల్ ఇంగ్లాండ్‌లో తొలి రౌండ్ ఫలితమే నిదర్శనం.

# బుమ్రా.. ఇక వేరే దారిలోకి!



**టీమ్‌ఇండియా ప్రధాన బౌలింగ్ అస్త్రం జస్‌ప్రీత్ బుమ్రా. అతడి సామర్థ్యం గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. భారత్ తాజాగా టీ20 ప్రపంచకప్ గెలవడంలో అతడు అత్యంత కీలక పాత్ర పోషించాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌నకు కూడా బుమ్రా సేవలు భారత్‌కు చాలా అవసరం. అందుకే ఆ టోర్నీ కోసం అతణ్ని జాగ్రత్తగా కాపాడుకోవాలనుకుంటోంది జట్టు యాజమాన్యం. 2027 అక్టోబరు-నవంబరులో దక్షిణాఫ్రికాలో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఈ నేపథ్యంలో బుమ్రా దృష్టి ప్రధానంగా వన్డేలపైనే నిలవనుంది. ఈ 18 నెలల్లో అతడు టీ20ల కంటే వన్డే మ్యాచ్‌లు ఎక్కువగా ఆడుతున్నాడు. పనిభారం తగ్గించాలి కాబట్టి.. బుమ్రాను తక్కువ టీ20 మ్యాచ్‌ల్లో ఆడిస్తారు.ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ముగిశాక టీమ్‌ఇండియా వన్డే ప్రపంచకప్ సన్నాహకం మొదలవుతుంది. ఐపీఎల్ ఆఖరికి జాతీయ సెలక్షన్ కమిటీ, వీవీఎస్ లక్ష్మణ్ నేతృత్వంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, టీమ్ మేనేజ్‌మెంట్ కలిసి బుమ్రా పనిభార నిర్వహణపై ఓ బ్లూప్రింట్ సిద్ధం చేస్తారని తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) మ్యాచ్‌లు ఆడే విషయంలో మాత్రం బుమ్రా రాజీపడే అవకాశం లేదు. అతడి పనిభార నిర్వహణ గత రెండేళ్లలో ఉన్నట్లే ఉంటుందని తెలుస్తోంది. ఆ కాలంలో అతడు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడలేదు. 2023 నవంబరు 19 (వన్డే ప్రపంచకప్ ఫైనల్) తర్వాత.. ఈ ప్రపంచకప్ కన్నా ముందు జరిగిన కివీస్‌తో సిరీస్ ముందు వరకు బుమ్రా 42 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 21 టెస్టులు, 21 టీ20ల్లో బరిలోకి దిగాడు. ఇక నుంచి మాత్రం టీ20లకు కాకుండా వన్డేలకు ప్రాధాన్యమిస్తాడు."టీమ్‌ఇండియా ఆడే ఏ అంతర్జాతీయ టోర్నీకి అయినా బుమ్రా ఫిట్‌నెస్ చాలా కీలకం. అందుకే భారత జట్టు మేనేజ్‌మెంట్ చాలా జాగ్రత్తగా ఉండాలి. అతడు ఆడాల్సిన ఫార్మాట్ల ప్రాధాన్య క్రమాన్ని నిర్ణయించాలి. అతడు టెస్టు క్రికెట్ తప్పక ఆడతాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో మాత్రం అతడు వన్డేలపై ఎక్కువ దృష్టిసారిస్తాడు" అని ఓ బీసీసీఐ అధికారి వ్యాఖ్యానించాడు. భారత ఫాస్ట్‌బౌలింగ్ పూల్ మరీ పెద్దదేమీ కాదు. అందులో బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా ప్రధాన సభ్యులని అర్థమవుతోంది.**

# అర్ష్ దీప్ మ్యాచ్ ఫీజులో కోత



భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మ్యాచ్ ఫీజులో కోత పడింది. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డరిల్ మిచెల్ పైకి బంతిని విసిరిన కారణంగా అర్ష్‌దీప్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించింది ఐసీసీ. అతడి ఖాతాలో ఓ అయోగ్యతా పాయింట్ కూడా చేరింది. ఫైనల్లో 11వ ఓవర్‌లో అర్ష్‌దీప్ వేసిన బంతిని మిచెల్ డిఫెన్స్ ఆడాడు. ఆ సమయంలో అతడు పరుగు కోసం ప్రయత్నించకపోయినా.. అర్ష్‌దీప్ బంతిని మిచెల్ మీదికి విసిరాడు. దీంతో మిచెల్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. తర్వాత అతణ్ని అర్ష్‌దీప్ సముదాయించాడు.

# అగ్రస్థానంలోనే స్మృతి



మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. జెమీమా రోడ్రిగ్స్ (12వ ర్యాంకు) ఓ స్థానం కోల్పోయింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (2), ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ (3), ఆ జట్టు ఆల్‌రౌండర్ ఆష్లీ గార్డ్‌నర్ (4), ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్‌సీవర్ బ్రంట్ (5) టాప్5లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి అత్యుత్తమంగా దీప్తి శర్మ ఆరో స్థానంలో నిలిచింది. టాప్10లో ఉన్న ఏకైక భారత బౌలర్ ఆమెనే. ఆష్లీ గార్డ్‌నర్ నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతోంది. హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్), అనాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా), మరిజేన్ కాప్ (దక్షిణాఫ్రికా), అమేలియా కెర్ (న్యూజిలాండ్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మకు నాలుగో ర్యాంకు దక్కింది. పాకిస్థాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతోంది.